# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-05-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్... భిన్నత్వంలో ఏకత్వంతో ధన్యమైన దేశమని బీజేపీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.
- ❖ సార్వత్రిక ఎన్నికల నేపధ్యంలో రేపు సాయంత్రం నుండి రాష్ట్రంలో 144వ సెక్షన్ అమలు కానుంది.
- ❖ సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి చందనోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.
- ❖ రాష్ట్రంలోని ఉత్తర, దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతంలో రానున్న రెండు రోజుల్లో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురవచ్చని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = =

భారత రాజ్యాంగాన్ని మారుస్తామని తాను ఎప్పుడూ చెప్పలేదని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ... కులం, మతం ఆధారంగా ప్రజల పట్ల ఎటువంటి వివక్ష ఉండకూడదని వ్యాఖ్యానించారు. మతపరమైన రిజర్వేషన్లను ప్రవేశపెట్టడం ద్వారా రాజ్యాంగాన్ని మార్చాలని ప్రతిపక్ష పార్టీ భావిస్తోందని ఆరోపించారు. భారత్ భిన్నత్వంలో ఏకత్వంతో ధన్యమైన దేశమని ప్రధాని ఈ సందర్భంగా తెలియజేశారు. కాగా.... అక్షయ తృతీయ సందర్భంగా దేశప్రజలకు ప్రధాని శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ప్రజలను దాతృత్వం దిశగా ప్రోత్సహిస్తుందని పేర్కొంటూ... ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త శక్తిని, ఉత్సాహాన్ని తీసుకురావాలని నరేంద్రమోదీ ఆకాంక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = =

సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి చందనోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ తెల్లవారు ఝామున స్వామివారి నిజరూపాన్ని వంశపారంపర్య ధర్మకర్త పూసపాటి అశోక గజపతిరాజు కుటుంబ సభ్యులు దర్శించుకుని, స్వామి వారికి పట్టు వస్త్రాలు, చందనం సమర్పించారు. చందనోత్సవ ఏర్పట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున పర్యవేక్షించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా జిల్లా యంత్రాంగం పటిష్టంగా ఏర్పాట్లు చేపట్టింది. వేసవి

దృష్ట్యా మంచినీటి కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు, క్యూలైన్ల వద్ద భక్తులకు మంచినీరు అందజేశారు. అదేవిధంగా సింహాచలం కొండ మీదకి ప్రత్యేక బస్సులను పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేశారు. చందనోత్సవం ఏర్పాట్ల పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

(వాయిస్ 20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలోని ఉత్తర, దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతంలో రానున్న రెండు రోజుల్లో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురవచ్చని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది. రాష్ట్రంలోని దిగువ ట్రోపో ఆవరణంలో దక్షిణ, నైరుతి గాలులు వీస్తున్నాయని పేర్కొంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించవచ్చని, గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల నేపథ్యంలో రేపు సాయంత్రం నుండి ఈ నెల 14వ తేదీ సాయంత్రం వరకు పలు కార్యక్రమాలపై ఆంక్షలు విధిస్తున్నట్టు ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973లోని 144 సెక్షన్ కింద ఈ సమయంలో సభలు, సమావేశాలు, ర్యాలీలపై నిషేధం అమలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. 5 గురి కంటే ఎక్కువ మంది గుమిగూడి ఉండరాదని అన్నారు.  అదేవిధంగా ప్రజలు ఆయుధాలు, తుపాకిలు, కర్రలు వంటివి కలిగి ఉండడం, ప్రదర్శించడం నిషేధమని కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

మేనిఫెస్టోను ఒక పవిత్ర గ్రంథంగా భావించి 99 శాతం హామీలను అమలు చేశామని..  వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈరోజు ఆయన వైఎస్సార్ జిల్లా కడపలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ, 59 నెలల్లో వివిధ రంగాల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. మహిళలకు  2 లక్షల 70 వేల కోట్ల రూపాయలు అందజేశామని, లంచాలు, వివక్ష లేని పాలన అందించామని తెలిపారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మర్చామని, 2 లక్షల 31 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అనంతపురం జిల్లా రెవిన్యూ అధికారి జి.రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈరోజు ఆయన  అనంతపురంలో పాత్రికేయులతో మాట్లాడుతూ... ఎండ తీవ్రత అధికంగా ఉన్న కారణంగా చిన్నపిల్లలు బయటకు వెళ్ళకుండా జాగ్రత్త వహించాలన్నారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద మంచినీరు, షామియనాలు ఏర్పాటు చేసినట్టు డీఆర్వో వివరించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈరోజు పశ్చిమ గోదావరి జిల్లా ఉండిలో జరిగిన 'ప్రజాగళం' సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్డిఏ కూటమి అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తామని ప్రకటించారు. ఉద్యోగులకు మధ్యంతర భృతిని ప్రకటిస్తామని, రొయ్యల రైతుల సమస్యలను పరిష్కరిస్తామని ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = =

భారత్‌లో ఓటు హక్కును వినియోగించేకునేందుకు పెద్ద సంఖ్యలో ప్రవాస భారతీయులు స్వదేశానికి వస్తున్నారు. గడచిన రెండు రోజుల్లో వివిధ దేశాల నుండి గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి 2 వేల మందికి పైగా ఎన్నారైలు చేరుకున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత విలువైనదని, దానిని వినియోగించుకుని, మంచి ప్రభుత్వం ఏర్పాటు కావాలనే ఆకాంక్షతో తాము స్వదేశానికి విచ్చేయడం జరిగిందని పలువురు ఎన్నారైలు ఆకాశవాణికి తెలిపారు. ఈ నెల 11, 12వ తేదీల్లో వివిధ దేశాల నుండి వచ్చే విమానాలు 95 శాతం ఆక్యుపెన్సీతో బుక్ అయినట్లు గన్నవరం విమానాశ్రయం అధికారులు తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

సార్వత్రిక ఎన్నికల నేపధ్యంలో ఉద్యోగుల కోసం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నుండి రంపచోడవరం వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు నిర్వహిస్తున్నట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. రేపు సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు ప్రతి గంటకు ఒక సర్వీసు చొప్పున ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఈ బస్సులు పాడేరు నుండి జి.మాడుగుల, చింతపల్లి, కృష్ణ దేవి పేట, రాజవొమ్మంగి, అడ్డతీగల మీదగా రంపచోడవరం వెళతాయని, అధికారులు వీటి సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల పోలింగ్ శాతాన్ని నమోదు చేసేందుకు కంట్రోల్ రూంలో సెక్టార్ వారీగా ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు విజయనగరం జిల్లా ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి తెలిపారు. పోలింగ్ రోజున ప్రతి 2 గంటలకు పోలింగ్ శాతాన్ని తెలియజేయాలని ఆమె అధికారులకు సూచించారు. కంట్రోల్ రూం రోజుకి 24 గంటలూ పని చేస్తుందని, పోలింగ్ శాతాన్ని జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు తెలియజేయాలని అన్నారు. అదేవిధంగా ఎక్కడ ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరిగినా తక్షణం తెలియజేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులోని మోదకొండమ్మ ఉత్సవాలు ఈ నెల 19వ తేదీ నుండి మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఆంధ్ర రాష్ట్రంలోనే అతిపెద్ద గిరిజన ఉత్సవంగా చెప్పబడే ఈ ఉత్సవాల పోస్టర్‌ను పాడేరు శాసన సభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఈరోజు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఏలూరు జిల్లాలో 15 వేల 615 మంది ప్రభుత్వ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకున్నట్టు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 9వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా పోలీసులు, ఇతర అత్యవసర సేవలకు చెందిన శాఖల సిబ్బందికి ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం ఇవ్వడం జరిగిందన్నారు. ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు, పోలవరం, చింతలపూడి, నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలకు చెందిన సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకున్నారని కలెక్టర్ ఈ సందర్భంగా తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

మచిలీపట్నం కలెక్టరేట్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశ మందిరాన్ని జిల్లా కలెక్టర్ బాలాజీ, రెవెన్యూ అధికారి చంద్రశేఖర్ లు ఈరోజు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించడం కోసం నూతన భవన సముదాయాన్ని కోటి రూపాయల ఖర్చుతో నిర్మించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని ఉన్నతాధికారులంతా ఒకే చోట సమావేశం అయ్యే విధంగా మీటింగ్ హాల్ ను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించడం జరిగిందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఇండియన్ ప్రీమియర్ లీగ్ -2024లో భాగంగా గుజరాత్ టైటాన్స్- చెన్నై సూపర్ కింగ్స్ మరోసారి తలపడనున్నాయి. ఈరోజు అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా సాయంత్రం 7 గంటల 30 నిమిషాలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. ఇదే సీజన్ లో చిదంబరం స్టేడియం వేదికగా తలపడిన మ్యాచ్‌లో విజయం సాధించిన చెన్నై జట్టు ఈ స్టేడియంలో మరో విజయం నమోదు చేయాలని చూస్తోంది.

= = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = =